


"కథ చెప్పు తాతయ్యా" అని వేధిస్తున్నారు శాస్త్రిగారి మనమలు చుట్టూ చేరి.

"ఏం కథ చెప్పనురా?" అని ఆలోచిస్తున్నట్లు బోసినోరు విప్పి పైకి చూశాడు ఎనభై ఏళ్ళు పైబడుతున్న శాస్త్రిగారు.

"ఏదో వొహటి" అంటూ నిద్రకి ఓ పక్క ఆవులిస్తూ చేతులు పట్టుకు గుంజుతున్నారు పిల్లలు.

"సరే" అంటూ ..... మొదలెట్టాడు శాస్త్రిగారు. "ఒకరోజున ...." ఊ కొడ్తున్న చిన్న పిల్లలతో పాటు పట్నం కాలేజీలో చదువుతున్న శాస్త్రిగారి పెద్ద మనవడు కూడా చదువుతున్న పుస్తకం మూసి వింటున్నాడు.

"చాలా సంవత్సరాల క్రితం ..... నాకు పెళ్ళయిన కొత్తల్లో .... "

"అంటే నేను పుట్టిన తర్వాతనే?" అన్నాడు ఆఖరి మనవడు.

"ఇహ" అని నోరంతా విప్పి నవ్వి వాణ్ణి వొళ్ళోకి తీసుకుని మళ్ళీ మొదలెట్టాడు

శాస్త్రిగారు.

"పెద్దింటమ్మ గుడిదగ్గర చేనికెళ్ళి వస్తున్నాను. అటూ ఇటూ పొలాలు, కనుచూపుమేర భూమంతా పచ్చటి కంబళీ పరిచినట్టుంది. నేలతల్లి చిలకాకు పచ్చ చీర వొళ్ళంతా చుట్టుకున్నట్టు పొలాలు. పొలం చుట్టూ తిరిగి, గట్ల పక్కన కుంటలో కాసిన్నీళ్ళు తాగి అట్లా డొంకలో కొచ్చాను. మావిళ్ళ చేను దాటానో లేదో చిటపట చినుకులు ప్రారంభమైనాయి. తలెత్తి పైకి చూస్తే సూర్యుడెక్కడికో పారిపోయాడు. నల్లమేఘాలు గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నాయి. ఆకాశమంతా నల్ల మేఘాలే. నల్లచీర కట్టుకున్న ఆడదాని మొల్లో బాకులాగా ఆ నల్ల మేఘాల మధ్య ఓ మెరుపు, తూర్పు వైకుంఠపురం కొండమీద ఓ గర్జింపు- వాన పెద్దదైంది.

వలవల కురుస్తోంది వాన!

జల జల కురుస్తోంది వాన!

నేను గొడుగు తెచ్చుకోకపోతిని. పూర్తిగా తడిసిపోయాను. అయినా గొడుగులూ గోనె గుడ్డలూ ఏవిటి? అల్లంత ఆకాశగంగ పనిగట్టుకొచ్చి ఈ నేల తల్లిని చల్లగా కౌగలించుకుంటుంటే - ఈ మనిషన్నవాడెవడు గొడుగడ్డం పెట్టుకోటానికి?

ఉన్నట్టుండి మబ్బులు పెద్ద పెట్టున ఉరిమాయి. వర్షరాణి తీవ్రవేగంతో రథం నడిపిస్తుంటే రయ్యిన పరుగెత్తే రథ చక్రాల ధ్వనిలా ఉంది ఆ ఉరుము. ఆ ఉరుము అలా దూరమవుతూంటే అదిలించినప్పుడు ఆ రథానికి పూన్చిన గుర్రం సకిలింపులా ఉంది. అల్లంతలో మబ్బుల్లో గొప్ప మెరుపు. అది వర్షరాణి కిరీటంలా ఉంది. కిరీటమే కళ్ళు మిరుమిట్లు గొల్పితే ఆ రాణి ఎలా ఉంటుందో! అలంకారాలు చూడ్డానికే ఈ కళ్ళు మూసుకుపోతుంటే ఇంక ఆకారాలెలా కన్పిస్తాయి?

డొంకలో బురద బురదయిపోయి కాలు సాగటంలేదు. చెప్పులు విడిచి చేతపట్టాను. "వారెవరె ! అప్పుడనిపించిందిరా! గంగమ్మ ఈ భూమి నంతటినీ

చల్లబరుస్తుంటే, నేను చల్లబడక ఈ పాత చెప్పు లర్థంపెట్టుకున్నానా అని. ఇప్పుడు వర్షం నామీద కురుస్తోంది. నాలోంచి కురుస్తోంది. జల్లు జల్లుగా కురుస్తోంది. ఛళ్ళుఛళ్ళున కురుస్తోంది. వర్షపు చల్లదనం శిరస్సునుండి పాదాలదాక పాకి శరీరంలోని సర్వాణువుల్ని కడిగేస్తోంది. ఆ చల్లదనం నరనరాల్లోకి పరుగులెత్తి వెచ్చగా ఉంది. అది ఎన్ని స్నానాల పెట్టు! ఎన్ని మునకలు దానికి దీటు! వర్షమంతా నామీదే పడాలనిపించింది. నన్ను ముంచెయ్యాలనిపించింది. ఆ సమయంలో నేను నడవటం మానేసి, వొరేయ్! ఆ డొంక మధ్యలో నిటారుగా నుంచున్నారా!

అటుపక్క చూస్తే పొలాలమీద వాన. మంచి శనగ చేనుమీద వాన పడుతుంటే. పైరుపైరంతా ఆనందంగా వూగుతోంది. ధనియాల చేను మీద వానపడుతుంటే ఆ మేరంతా కొత్తిమెర వాసన, వాన సుగంధం కలిసిపోయిన గాలి. వానకి జొన్న చేను నృత్యం చేస్తోంది. మొక్కజొన్న కండెలుబ్బి పోతున్నాయి. సజ్జ కంకులు పొంగుతున్నాయి. వరి ఉన్నట్టుండి పెరుగుతోంది. కందికాయలు, పిల్లిపెసర్లు కువకువలాడుతున్నాయి. వేరుశనగ చేను విచ్చుకుని వేళ్ళలోకి దింపుకుంటోంది వర్షధారల్ని. అలా నేలనేలంతా పైరు పైరంతా వర్షానికి పరిపరివిధాలుగా పులకలెత్తుతోంది. పొలాలమీద వాన కొంచెం తగ్గుముఖం పట్టినట్లనిపించింది. కుడిపక్కకి తిరిగిచూస్తే కృష్ణమీద వర్షం జోరుగా ఉందనిపించి కృష్ణ వొడ్డుకు బయల్దేరాను. అలా ఎందుకనిపించిందీ అని అడక్కు. రంగావఝులవారి చేనుదాటి అలా కృష్ణ వొడ్డుకి వస్తినిగదా-

వరె వరె వరె! అదీ వర్షం.

అంత గొప్ప ప్రవాహంలో సంతత ధారగా వానపడిపోతోంది. నీళ్ళలో నీళ్ళు! ధారలో ధార! ప్రవాహంలో ప్రవాహం! వాన చినుకులు కృష్ణలో పడుతుంటే పెద్దక్క ప్రేమగా హత్తుకుంటే వొళ్ళు జలదరించినట్టు, ఆ ప్రవాహం మీద ఓ జలదరింపు, ఓ పులకరింపు, సిగ్గుతో నవ్వినప్పుడు బుగ్గమీద సొట్టలా చినుకు

పద్దచోట చిన్న గుంట. అంతలో ఆ గుంట మాయం. మళ్ళీ చినుకు మళ్ళీ గుంట. మళ్ళీ మళ్ళీ చినుకులు. అంతలో మాయమయి మళ్ళీ మళ్ళీ గుంటలు. కృష్ణంతా చినుకులు. కృష్ణంతా పులకరింతలు. ఇసకమీద చినుకులు. కసకస చినుకులు. రేణు రేణువుకీ చినుకులు. విసవిస, సరసర చినుకులు. రివ్వుమని, రయ్యిమని, చినుకులు, ఊపులా చినుకులు. తాపులా చినుకులు. ఛళ్లుమని, ఫెళ్లుమని, దభిల్లుమని, పెటిల్లుమని చినుకులు-చినుకులు - కృష్ణ నిండా, ఇసక నిండా, నేల నిండా - చినుకులు చినుకులు - రెండుగంగలు కలిసిపోయినట్టు, నింగీ నేలా ఒకటే అన్నట్టు. ఈ జగత్తులో నీళ్ళు తప్ప ఇంకేవీ లేనట్టు, అన్నిటికీ నీళ్ళే ఆధారమన్నట్టు వాన, వర్షం, గంగమ్మ, కిష్టమ్మ సంద్రం-అదేదో దానికి నువ్వే పేరైనా పెట్టుకో.

అలా ఆ అఖండ జల ప్రపంచం మధ్య మతిపోయి నుంచున్నానా- పడవ్వాళ్లు నలుగురైదుగురు వచ్చి "శాస్తుల్లుగారు ఈదున్నారేటి?" అన్నారు. అప్పుడీ లోకంలోపడి- నేనిక్కడే ఉంటానంటే "ఇదేవన్నా మతి భ్రమణవేమో" అనుకుంటారేమోనని వాళ్ళవెంట వూళ్ళో కొచ్చాను.

"వర్షం ఆగిపోయిందని చెప్పకు తాతయ్యా" అన్నాడు కాలేజీలో చదువుతున్న మనవడు. అప్పటికి మిగతా మనవలు నిద్రపోయారు.

"లేదురా ఇంకా కురుస్తోంది. ఆగకుండా కురుస్తోంది. ఇల్లు దగ్గర పడుతున్నకొద్దీ కంగారెక్కువయింది. మీ నాయనమ్మా, కొత్తగా కాపరానికొచ్చిన చిన్న పిల్లయ్యె! అందులో పట్నంలో కచ్చేరీ గుమాస్తాగారి కూతురేమో, వర్షంలో తడిసి జలుబుచేసి ఎక్కడ ముక్కూడ గొట్టుకుంటుందో అని గబగబ నడిచాను. ఇంట్లో కొస్తే ముందు వరండాలో లేదు. మధ్య గదిలో లేదు. వంటింట్లో లేదు. "ఓహోయ్!" అని కేకేస్తే బదులు లేదు. గబగబా దొడ్లోకొస్తే దొడ్డి చివర ఆరుబయట కృష్ణ వైపు తిరిగి నుంచుని కన్పించింది. వర్షం కృష్ణలో కలుస్తుంటే, కృష్ణ వర్షంలో కలుస్తుంటే, వర్షంలో తను కలిసిపోయి, చేతులు విప్పార్చి తల ములకలుగా హాయిగా తడుస్తోంది.*